


# కాకి

- వి. రమాదేవి ఆచార్య

**బ**యుట ఒకటే కాకుల రొద!

మావారు ఆఫీసుకీ, పిల్లలు స్కూళ్లకీ వెళ్లిపోవడంతో, ఇంట్లో ప్రశాంతంగా కూర్చుని కథ రాద్దామని మొదలు పెట్టానోలేదో, బయుట ఒకటే గోల... కాకిగోల..

ఏవిఁటా? అని బయుటకు వెళ్లి చూశాను.

ఎక్కడ్నుంచి వచ్చిందో ఏమో, మా చెట్టుకొమ్మమీద కూచున్న ఒక కాకిని, మిగతా కాకులన్నీ కావు, కావుమంటూ పొడుస్తున్నాయి. ఆగోల భరించలేక, అదలించి కాకుల్ని వెళ్లగొట్టాను. అన్నీ వెళ్లిపోయాయిగానీ, ఆ కొత్త కాకి మాత్రం కదల్లేక, భయుంభయుంగా దీనంగా చూస్తోంది.

నా రచనా వ్యాసంగాన్ని కొనసాగించేందుకై ఇంట్లోకి వెళ్లబోతున్న సమయుంలో, ఎదురుగా ఓ వంద అడుగుల దూరంలో ఉన్న గుడిసె దగ్గర గొడవ జరుగుతోంది. ముగ్గురు నలుగురు ఆడవాళ్లు ఆ గుడిసెలో ఉండే అమ్మాయిమీద దాడి చేస్తున్నారు. గేటు ఇవతలనుండే చూస్తున్నాను ఆ దృశ్యాన్ని..

"ఇది సంసారులుండే చోటనుకున్నావా, దొమ్మరగుడిసెలనుకున్నావా?"

"ఎక్కడ్నించి వచ్చావే లం..."

నోట్లో నాలికలేని కుర్రాడిని ముగ్గులోకి లాగి, గుడిసె ఏయించింది టక్కులాడి.."

"అమ్మో! ఇది ఇక్కడే ఉంటే మనకాపురాల్లో బుగ్గే!"

"వెంటనే ఖాళీ చేసి ఎల్తావా లేదా?"

ఇలా అందరూ మాటల్తో కొట్టినంత పని చేస్తున్నా, ఆ అమ్మాయి మాత్రం కిక్కురుమనడం లేదు. దాంతో వాళ్లు మరింత రెచ్చిపోతున్నారు.

"ఎక్కడినుండి వచ్చిందో ఈ రంకులాడి,... వచ్చీ వచ్చీ... ఇంకెక్కడా దొరకనట్టు మన ఇళ్ల మధ్యకొచ్చి పడింది.."

"సంసారుల ఇళ్లమధ్య ఇలాంటోళ్లు ఉంటే ఇంకేవన్నా ఉందా?"

ఇలా తలొకరూ తలో మాటా అని ఆయాసం వచ్చిందో ఏమో?...

"ఇదిగో, రేప్పొద్దున్నకల్లా గుడిసె ఖాళీ చేసి పోకపొయ్యావె మేవేం చేత్తామో మాకే తెలీదు"..

అంటూ అల్టిమేటం జారీచేసి వెళ్లిపోయారు ఆ ప్రచండికలు.

పాపం, ఆ అమ్మాయి వారిని పల్లెత్తు మాట కూడా అనలేదు. అలాగే తలదించుకుని ఏడుస్తూ కూచుంది. మధ్యలో ఒకసారి తలెత్తినప్పుడు నావైపు దీనంగా చూసింది. చెట్టుమీది కాకి చూసిన దీనపు చూపే ఈ అమ్మాయి మొహంలో కూడా కనిపించింది.

"రమ్మని" సైగ చేసి, నేను లోపలికి వెళ్లాను.

మాది నగర శివార్లలో ఇప్పుడిప్పుడే వెలుస్తున్న కాలనీ. ఇళ్లు తక్కువ ఖాళీస్థలం ఎక్కువ. ఇక్కడో ఇల్లూ, అక్కడో ఇల్లూ నిర్మాణపు అన్ని దశల్లోనూ దర్శనమిస్తూ ఉంటాయి. దాంతో ఆయా ఇళ్లల్లో పనిచేసే కూలీకుటుంబాలు అక్కడే గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. మా ఇంటికెదురుగా వంద అడుగుల దూరంలో ఉన్న ఓ గుడిసె ముందు జరిగిందే ఇందాకటి రభస...

ఆ గుడిసె, ఇళ్లకు సున్నాలూ రంగులూ వేసే గోపాలానిది. కుర్రాడు ఎలాంటివాడో మనకు తెలీదుగానీ, వినయువిధేయతలు ఉట్టిపడేలా మాట్లాడతాడు. ఇచ్చినపని చక్కగాచేస్తూ ఉంటాడు. అక్కడే మా ఇంట్కి ఎదురుగా రెండుప్లాట్ల అవతల ఉన్న ఇంటి కాంపౌండ్ వాల్‌కి ఆనించి ఓ చిన్న గుడిసె వేసుకుని ఉంటున్నాడు.

ఆ అమ్మాయి వచ్చి మెట్లమీద కూచుంది. కూలిపని చేసుకునేదైనా, వయుస్సులో ఉందేమో,

అందంగా ఆకర్షణీయంగా ఉంది. వయస్సు పద్దెని మిది ఉండొచ్చు.

"ఏం పేరు?"

"జయమ్మండి..."

"ఏమిటి గొడవ?"

"ఏంటీ లేదుండి, గోపాలమూ నేనూ పేమిం చుకున్నామండి... కలిసి ఉందామనుకున్నామండి... అందుకని నేనీడకి వచ్చేసినానండి..!"

అంటే కొత్తగా వచ్చిన కాకిలాంటిదన్నమాట.. అని స్వగతంగా అనుకున్నాను..

"మరి నీకెవరూ లేరా?"

"మాది సీకాకోళం దగ్గిరో పల్లెటూరండి... ఆడ ఎవసాయప్పనులు బొత్తిగా నేకపోతే, నాను మా ఊరోళ్లతో కల్సి, కడుపు సేత్తో అట్టుకుని, ఈ ఐద్రాబాద్ వచ్చేసినానండి!.. అప్పుడు, ఉప్పల్‌లో పనిసేసేటప్పుడు, ఈ గోపాలం కలిసేడండి.... మాయమాటల్చెప్పి నన్ను లోబరుసుకున్నాడండి!.. నాకిప్పుడు మూడోనెల... మళ్లీ మా ఊరికి ఈ మొకం పెట్టుకుని ఎలా ఎల్లగలను సెప్పండి... ఈ మాటే గోపాలంతో అని ఏడిసానండి. ఆడు డాట్ట మ్మకాడికి తీసుకెళ్లేడు. మూడెల్లి నాలుగొత్తన్నాయి ఇప్పుడు కడుపు తీసేత్తే, తల్లికీ పిల్లకీ పెమాదం అందండి.. గోపాలం మంచోడేనమ్మా... "ఇక సేసే దేం ఉందిలెయ్యే, సక్కగా మొగుడూ పెల్లాల్లా కాప రం సేసుకుందాం పదే" అని నన్ను తీసుకొచ్చి ఈ గుడిసెలో ఎట్టేడమ్మగోరు! ఇందులో నా తప్పేంటమ్మగోరూ?"

"మరి వాళ్లందరూ ఏకమై నిన్ను అంతలేసి మాటలంటూ ఉంటే, నువ్వు కిమ్మనకుండా అలా ఉండిపొయ్యావేంటి?"

"ఏంసేసేదమ్మగోరూ! తానబలం... ఆళ్లు ఎన్నాళ్లనిచో ఈడ ఉన్నారు... నేను ఈడ తలదా సుకోడానికి వచ్చిందాన్ని... ఆళ్లతో నాకు గొడవెందు కమ్మా!"

"అలాగని.... వాళ్లు నిన్ను కొట్టినంత పని చేసినా, అలాగే ఏడుస్తూ కూచున్నావేం?"

"ఏటి చేసేదమ్మా! ఎవళకర్మాన ఆళ్లే పోతారు... పడ్డోళ్లు ఎప్పుడూ సెడ్డోళ్లు కాదమ్మా! పేదోడికోసం పెదవికి సేటమ్మా, కాలం కలిసిరా నప్పు..." అంది కళ్లు చెంగుతో వత్తుకుంటూ..

అసలే నెలతప్పి, తనవాళ్లనందర్నీ వదిలి ఉండాల్సి వచ్చిందని ఒకవైపు బాధ పడుతూంటే, దానికి తోడు గోరుచుట్టుమీద రోకలిపోటులా, వీళ్ల దాడి ఒకటి...


"బాగుందే నీ వేదాంతం... ఈ గొడవంతా దేనికి మీ వాళ్లదగ్గరికి వెళ్లిపోరాదూ?"

"ఏ ముకం ఎట్టుకుని ఎల్లమంటావమ్మా.. ఎల్తేమాత్రం ఆళ్లేటి సెయ్యగల్రు సెప్పండి. ఆడికెల్లి ఏటిసెయ్యాల? చేద్దామంటే కూలి దొరకదు... దొరి కినా ఉప్పుడు ఈ పరిస్తితిలో నానేం సెయ్యగల్ను సెప్పండి? ఊరెల్లితే అందర్లోనూ గొడవైపోడం తప్పించి, మరే నాబం నేదమ్మా... మా అయ్య నా కెలాగూ పెల్లి సెయ్యనేడు. అందుకే ఈ గోపా లాన్ని మంచి సేసుకుని ఆడితోనే ఉండిపోదామను కుంతన్నానమ్మగోరూ!"

"మరి నువ్వు వాళ్లలాగే యిక్కడే ఉండదల్చు కున్నావు కదా! అలానోట్లో నాలుకలేనిదానిలా ఉంటే, వాళ్లు నిన్ను బ్రతకనిస్తారా?"

"మరేటి సేసేదమ్మగోరూ!... రేపు మరోసోట గుడిసేసుకుని పోతాం.."

"అక్కడకూడా ఇలాంటి వాళ్లేనే ఉండేది. అక్క డమాత్రం వీళ్లు నిన్ను సుఖంగా బ్రతకనిస్తారా? జనాలకి భయపడి ఎంత దూరం అనిపోతావు? ఎంతకాలం బ్రతుకుతావ్? అసలే కూలీజనం అంటేనే అందరికీ అలుసు. పైగా వయస్సులో ఉన్న ఆడదానివి. ఆడదానికి ఆడదే శత్రువు... సాటి ఆడ




దాని కష్టాన్ని చూసి జాలిపడి, ఆదరించి మానసిక స్థైర్యాన్నిచ్చి ఆదుకోవాల్సిందిపోయి, వాళ్లే నిన్ను కాకుల్లా పొడుచుకు తింటున్నారు. నువ్వు ఇలా ఏడుస్తూ కూచుంటే లాభం లేదు, ధైర్యం తెచ్చుకో... నీకోసం... నీ మనుగడకోసం, నీ కడుపులో ఉన్న బిడ్డకోసం ఎదురు తిరగాలి. వాళ్లనోళ్లు మూయించి, నీస్థానబలిమి పెంచుకో.." అని జయమ్మకు హితో పదేశం చేశాను.

"తిన్నావా?"

"లేదమ్మా, వండుకోవాల... ఇంతలో ఈ బెడి గొల్లొకటి వచ్చిపడిందమ్మా!" అంటూ లేస్తున్న జయ మ్మను, 'ఆగు' అంటూ, లోపలికి వెళ్లి ఒక గిన్నెలో కాస్త అన్నం, కూరా, పచ్చడీ వేసుకొచ్చి, ఇచ్చి..

"ఇది తిను, ఆ తర్వాత నెమ్మదిగా వండు కుందువు గానిలే.." అన్నాను.

ఆ గిన్నెమీద కొంగు మూతేసుకుని తనగుడి సెవైపు వెళ్తున్న జయమ్మను చూస్తూంటే... నాకు మా చెట్టుమీది కొత్తకాకే గుతుకొచ్చింది.

000

ఆ తర్వాత రోజు...

బైట ఏదో గొడవ జరుగుతున్నట్టు అనిపించ డంతో, గబగబా గేటు దగ్గరికి వెళ్లి చూశాను.

"... పోనీలేమ్మా, ఎందుగ్గొడవా... అని నోర్మూ సుక్కూసుంటే.. నోటికొచ్చినట్టు మాట్లాడతారా!.. రండే ఎవత్తి వస్తాదో రండి... ఎవత్తే నన్ను లం.. అన్నాది... ఇలా రమ్మను ఆలమ్మీని.. ఏవే, నువ్వు ఆ రంగన్న మేస్త్రీరితో సాగించే రంకు భాగోతం ఎవడికీ తెలీదనుకుంతన్నావేటే?...ఏవే కాంతమ్మా, నువ్వేటే అన్నావ్ నిన్ను..? నానిక్కడుంటే మీ కాపురాలు కూలిపోతాయా?.. మీ మొగుళ్లని మీ సెప్పుసేతల్లో ఎట్టుకోడం సేతకాక, ఆళ్లు అడ్డమైన ముండల్కి తిరూతుంటే ఏటీ సెయ్యనేక... నామీద అడతన్నారేంటే... నాలో ఏం రంకు సూసేరే మీరు?.. ఏవే సారమ్మా, నీకు ఈడు ఎన్నో మొగుడే... ఎందర్ని మారుత్తావే.. దొంగలం... పేద్ద సంసారుల్లా మాట్లాడతా ఉన్నారు.. ఎవత్తే నామీద సెయ్యేసే దమ్మున్న లం...

ఎవరా అని గేటు దగ్గరికి వెళ్లి చూస్తే ఇంకె వరు, జయమ్మే! చేత్తో కర్ర పట్టుకుని, అపరకాళిలా వాళ్లపై విరుచుకు పడుతోంది.

లోపలికి వస్తున్న నా దృష్టి చెట్టుమీద పడింది. అక్కడ ఒంటరిగా భయంభయంగా కూర్చున్న కాకి లేదు. అదీ హాయిగా మేతకు వెళ్లిపోయింది కాబోలు. ■